ఐదురోడ్ల కూడలికి ఆధునిక హంగులు

- కంబాలచెరువు జంక్షన్‌లో అభివృద్ధి పనులు
- దండి సత్యాగ్రహం నాటి గాంధీ విగ్రహాల ఏర్పాటు
- రూ.1.11 కోట్లతో మహర్దశ



అభివృద్ధి పనుల అనంతరం కంబాలచెరువు జంక్షన్ (ఊహాచిత్రం)



శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ప్రధానమైన కంబాల చెరువు జంక్షన్ అత్యాధునికంగా ముస్తాబవుతోంది. గతంలో సర్వంగాంధీ జంక్షన్‌గా పేరు పొందిన ఈ సెంటర్ తర్వాత కాలంలో వివేకానందుని విగ్రహం ఏర్పాటుతో వివేకానంద సెంటర్‌గా పిలవబడేది. నగరాభివృద్ధిలో భాగంగా ఈ జంక్షన్‌ను అద్భుతంగా సిద్ధం చేస్తున్నారు. ఏజెన్సీ ముఖద్వారంగా సుపరిచితమైన ఈ కూడలి మీదుగా నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దేవీచౌక్ తరువాత ఐదు రోడ్ల కూడలి ఇది. ఆర్యాపురం, సీతానగరం, కోరుకొండ, హైటెక్ బస్టాండ్, కంబాల చెరువు నుంచి వచ్చే రోడ్లు అన్నీ ఈ జంక్షన్‌లో కలుస్తాయి.

మరింత శోభ

నగరంలోని పుష్కరఘాట్, అర్బన్ స్క్వేర్ సెంటల్, దేవీచౌక్. ఇలా అభివృద్ధి చెందిన ప్రాంతాల జాబితాలోకి కంబాల చెరువు జంక్షన్ చేరే సమయం దగ్గరలోనే ఉంది. ఈ జంక్షన్‌లో స్వామి వివేకానంద విగ్రహం ఇప్పటికే ఉంది. అలాగే దండి సత్యాగ్రహం నాటి గాంధీ, తదితర నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా తయారవుతున్న ఈ జంక్షన్ నగరానికి మరింత శోభ, అందాన్ని తీసుకురానుంది. నగర పాలక సంస్థ నిధులు రూ.1.11 కోట్లతో ఈ కూడలిలో వాటర్ ఫౌంటైన్‌తో పాటు రంగురంగుల విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయనున్నారు.

నగరానికి కొత్తందం



రూ.కోటి పైబడి ఖర్చుతో సిద్ధమవుతున్న ఈ ఐదురోడ్ల జంక్షన్ నగరానికే అందం తీసుకురానుంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇలా అభివృద్ధి జరగడం అభినందనీయం. తెలుగుదేశం పార్టీ హయాంలో పుష్కరాల సమయంలో మురిపించే హంగులు తప్ప ఇంత అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు. నగరాభివృద్ధికి రూ.125 కోట్లను సీఎం జగన్ కేటాయించడం ప్రజల అదృష్టం.

– కేఎల్ఎన్ రెడ్డి, విశ్రాంత ఉద్యోగి, నారాయణపురం

రెండు నెలల్లో పూర్తి



కంబాలచెరువు జంక్షన్ అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తిస్థాయిలో జరుగుతాయి. రూ.1.11 కోట్లతో నాణ్యత ప్రమాణాలతో ఈ జంక్షన్ సిద్ధమవుతోంది. ఏ రోడ్డులోంచి చూసి అందంగా కనిపించేలా తయారు చేస్తున్నాం. నగరంలోని అందమైన ప్రదేశాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది.

– పాండురంగారావు, ఎస్ఈ, నగర పాలక సంస్థ, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

తెలుగుపై మమకారం పెంచుకోవాలి

సీటీఆర్ఐ: తెలుగు భాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి అన్నారు. కళాగౌతమి ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో ఆదివారం జరిగే రచయితల సమితి సమావేశంలో భాగంగా ఆదివారం ప్రకాశం నగర్ రౌండు పార్కు దగ్గర గల ధర్మంచర కమ్యూనిటీ హాలులో సంక్రాంతి కవితలతో సమావేశం నిర్వహించారు. అనంతరం కవులు సంక్రాంతి కవితలను, కథలు, పాటలను వినిపించారు. 'అచ్చ తెలుగు రామాయణం' అనే మంచి గ్రంథం బహూకరించి, చదివించి ఎన్నో విషయాలు తెలుసుకునేలా చేసినందుకు డాక్టర్ బీవీఎస్ మూర్తిని డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు దుశ్శాలువాలతో సత్కరించారు. కత్రా కార్తికేయ శర్మ, మారిశెట్టి మూర్తి, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, జోరా శర్మ, మల్లెమొగ్గల గోపాలరావు, చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఇన్‌స్ట్రక్టర్ల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. సంఘం అధ్యక్షుడిగా మిరపరాజు, కార్యదర్శిగా టి.రాంబాబు, కోశాధికారిగా పి.దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా అధ్యక్షురాలిగా ఎం.మౌనిక, సహాయ కార్యదర్శిగా కె.మోహిని నియమితులయ్యారు. కార్యక్రమంలో కె. మల్లేశ్వరి, ఎం.సత్యానందం పాల్గొన్నారు.

మత్తును వీడాలంటూ కళాజాత ప్రదర్శనలు



బుర్రకథ ద్వారా మత్తు పదార్థాలతో వచ్చే అనర్థాలను వివరిస్తున్న కళాకారులు

రాజానగరం: మత్తు పదార్థాల వినియోగం జీవితాలను ఏవిధంగా నాశనం చేస్తుందో ప్రజలను చైతన్య పరుస్తూ రాజమహేంద్రవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముక్కినాడ, తోకాడ గ్రామాల్లో ఆదివారం కళాజాత ప్రదర్శనలిచ్చారు. సారా తయారీని అరికట్టడం వల్ల, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, మత్తును విడనాడండి, జీవితాలను బాగు చేసుకోండంటూ బుర్రకథ రూపంలో తెలియజేశారు. ఎక్సైజ్ పోలీసులతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

భగవద్గీత మానవాళికి దిక్సూచి



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందించిన రుపా రఘునాథ్ మహారాజ్

సీటీఆర్ఐ: భగవద్గీత మానవాళికి దిక్సూచి వంటిదని రుపా రఘునాథ్ మహారాజ్ అన్నారు. ఆదివారం స్థానిక ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన నగర సంకీర్తనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరప్‌కు చెందిన తాను... ప్రభు శ్రీపాదుల వారి ప్రసంగాలతో 20 ఏళ్ల క్రితం రుపా రఘునాథ్ మహారాజ్‌గా మారానన్నారు. అప్పటి నుంచి పాశ్చాత్య దేశాలలో భగవద్గీత ప్రవచనాలు చెబుతున్నానన్నారు. అనంతరం ఇస్కాన్‌లో జరిగిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతలకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర ఇస్కాన్ శాఖ సభ్యులు నిమయదాసు, హేమంత్ పాల్గొన్నారు.

సమాన వేతనం కోసం పోరాడాలి

ప్రకాశం నగర్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం కార్మిక లోకం పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో అల్యూమినియం రోలింగ్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు మండ్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం 23, 24, 25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా దీక్షలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ పాల్పడుతున్న ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకోవాలని, 32 మంది ప్రజల బలిదానాలతో, 26 వేల మంది రైతుల త్యాగాలతో, 67 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు పార్లమెంటు సభ్యుల రాజీనామాలతో ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు సాధించుకున్నామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు సత్యం నాగేశ్వరరావు, పాలి సత్యనారాయ, సత్తి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి మాతృవియోగం

కడియం: వేమగిరికి చెందిన మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి నాగబాబుకు మాతృవియోగం కలిగింది. నాగబాబు తల్లి వెంకట రమణమ్మ ఆదివారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, స్థానిక నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం లైసెన్సుడ్ సర్వేయర్స్ ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్స్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం స్థానిక లూథరన్ చర్చి ఆవరణలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో సర్ ఆర్థర్ కాటన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కేఎల్ రావు, వీనం వీరన్న అనే నాలుగు జట్లుగా తలపడగా కేఎల్ రావు జట్టు విన్నర్‌గా, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జట్టు రన్నర్‌గా నిలిచాయి. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు.

పీవీ చలపతిరావు అస్తికల నిమజ్జనం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ పూర్వ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు అస్తికలను ఆయన కుమారుడు కుమారుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ మాధవ్ ఆదివారం స్థానిక కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

- పిల్లలు కళలపై మక్కువ పెంచుకోవాలి
- భారత్ ఆర్ట్స్ అకాడమీ సంక్రాంతి సంబరాలలో ఎంపీ భరత్



నృత్య కళాకారులతో ఎంపీ భరత్ రామ్

సీటీఆర్ఐ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం స్థానిక వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంబరాలు నిర్వహిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మన కళలను విశ్వవ్యాప్తం చేస్తున్న లయన్ లలితారావు, లయన్ డాక్టర్ కేవీ రమణారావు కృషిని ప్రశంసించారు. నేటి పిల్లలు చాలా చురుకుగా ఉంటున్నారని, వారికి కళలపై అవగాహన కల్పించి నేర్పిస్తే రాణిస్తారన్నారు. తన కుమార్తెలకు సంగీతం నేర్పిస్తున్నానని, అలాగే సంప్రదాయ నాట్యం కూడా నేర్పిస్తానని ఎంపీ భరత్ ఈ సందర్భంగా తెలిపారు. తమ తాతగారు ఆరేపల్లి సుబ్బారావు 1978లో ఇక్కడ కమిషనర్‌గా పనిచేశారని, ఆ సమయంలోనే ఈ కళాకేంద్రం నిర్మించారన్నారు. పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీ భరత్‌ను భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు జ్ఞాపికతో సత్కరించారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులకు తెలుగు సంప్రదాయాలు, పండగ విశిష్టతలపై అవగాహన కల్పించేందుకే ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం కందుకూరి రాజ్యలక్ష్మి డీఈడీ, ఎంబీఏ మహిళా కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను హితకారిణి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. భోగి మంటలు వేసి సంతోషాన్ని పంచుకున్నారు. ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో సంక్రాంతి వేడుకలు

కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, డైరెక్టర్ గుడాల ఆదిలక్ష్మి, ఎంబీఏ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.విద్యాప్రతిమ, డీఈడీ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయభాను పాల్గొన్నారు.

ముస్లింలంటే బాబుకు చిన్నచూపు

- పవిత్ర టోపీ పెడుతుంటే వద్దని నెట్టేస్తారా?
- ప్రతిపక్ష నేతపై జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆరిఫ్ ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ముస్లింలంటే అంత చిన్నచూపు ఎందుకని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. పవిత్ర టోపీ పెడుతుంటే వద్దని తిరస్కరించి ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన బాబుకు భవిష్యత్తులో పుట్టగతులుండవని మండిపడ్డారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లింలపై ఇంత కాలం కపట ప్రేమ చూపిన చంద్రబాబు అసలు రంగు కుప్పం వేదికగా బహిర్గతమైందన్నారు. బాబుకు గౌరవ సూచకంగా ముస్లింలు ధరించే టోపీ పెట్టాలని ప్రయత్నించిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ముస్లిం నేత గాజుల ఖాదర్ బాషాను పక్కకు నెట్టేసి అవమానపరచడం దారుణమని పేర్కొన్నారు. టీడీపీలో ముస్లింలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోగా, అవమానించడం దారుణమన్నారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ఐదు ఎమ్మెల్యే సీట్లు, పలు ఎమ్మెల్సీ సీట్లతో పాటు ఎన్నో నామినేటెడ్ పదవులను ముస్లింలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వనన్ని పదవులు ఇచ్చి ఆత్మబంధువుగా నిలిచారని ఆరిఫ్ చెప్పారు. ఆయనను చూసైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

ఎమ్మెల్యే గోరంట్ల పర్యటన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి 'ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక నాగులచెరువు మార్కెట్ నుంచి సాయికృష్ణ థియేటర్‌కు వెళ్లే రోడ్డులో సుమారు 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వార్డు రెవెన్యూ సెక్రటరీ ద్వారంపూడి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఏఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 0883 2421133, 94407 96576 (ఇన్‌స్పెక్టర్) నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



నిందితులతో అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 44 క్వార్టర్ (180 ఎంఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాడితోటలో కేతా సత్తిబాబు, గుత్తుల శకుంత, సుబ్బారావునగర్‌కు చెందిన బోడపాటి సత్యవతిని అరెస్టు చేశారు. వీరు మద్యం షాపులలో సీసాలను కొనుగోలు చేసి బయట ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు.

నేడు 'స్పందన'

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు. వీటితో పాటు డయల్ యువర్ కమిషనర్, ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

కడియం: దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993 –94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. స్నేహితులందరూ ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పుడు చేసిన అల్లరిని చెప్పుకుంటూ నిక్‌నేమ్‌లతో ఆప్యాయంగా పిలుచుకున్నారు. వారికి చదువుచెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్లో మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. సత్య కిడ్నీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్. సత్యప్రసాద్ మాట్లాడుతూ మూత్రపిండాల పనితీరు, కిడ్నీలో వచ్చే రాళ్లు, మూత్రాశయ వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర కోశాధికారి ఎస్.వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాసరావు, జిల్లా గౌరవ సలహాదారు పి.దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.సురేష్ బాబు, సహాయ కార్యదర్శి సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సత్యప్రసాద్‌ను, ఇటీవల నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను ఘనంగా సత్కరించారు.



డాక్టర్ సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఎంపీ సభ్యులు

జక్కంపూడి నగర్ వాసుల ఆందోళన

కడియం: తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆరోపిస్తూ వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్‌కు చెందిన పలువురు యువకులు, మహిళలు ఆదివారం ఆందోళనకు దిగారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి అకారణంగా కొందరు యువకులు తమ ఇళ్లలోకి వచ్చి దాడి చేసి పలువురిని గాయపరిచారన్నారు. ఈ విషయాన్ని వెంటనే కడియం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అయితే దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు కేసు నమోదు నమోదు చేయలేని బైవరపు మణికంఠ తెలిపారు. దీనిపై పోలీసులను సంప్రదించినప్పటికీ ఫలితం లేదన్నారు. పైగా ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తామని చెబుతున్నారన్నారు. బాధితులపై కూడా కేసు నమోదు చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.



జక్కంపూడి నగర్‌లో ఆందోళన చేస్తున్న యువకులు, మహిళలు

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం స్థాపించిన విద్యాసంస్థలను పరిరక్షించి, విస్తరింపజేసిన మేడూరి సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మేడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్యనారాయణ 102వ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వక్తలు మాట్లాడుతూ ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ, ఎస్‌కేఆర్ ఉమెన్స్ కాలేజీ ఏర్పాటు అభివృద్ధిలో మేడూరి కృషి చాలా ఉందన్నారు. మేడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులు ఆరుగురికి స్కాలర్‌షిప్‌లు అందించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, కందుల దుర్గేష్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు తిరుమల కుమార్, మారిశెట్టి కృష్ణకుమారి, సానబోయిన రామారావు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న మునికుమారి తదితరులు

'నన్నయ' ఎగ్జామినేషన్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అమ్మిరెడ్డి



వీసీ జగన్నాథరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మల్లిడి అమ్మిరెడ్డి

అనపర్తి: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పీజీ, డిగ్రీ కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్స్ ఫ్యాకల్టీ అసోసియేట్‌గా మండలంలోని మహేంద్రవాడకు చెందిన డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.జగన్నాథరావు చేతుల మీదుగా అందుకున్నట్లు అమ్మిరెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అమ్మిరెడ్డికి ఫ్యాకల్టీ అసోసియేట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా సత్కారం

ప్రకాశం నగర్: బ్రాహ్మణ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం నగరానికి విచ్చేసిన దుర్గాప్రసాద్ దంపతులను నగర బ్రాహ్మణ కార్యాలయంలో సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘం నగర మహిళా అధ్యక్షురాలు జి.సూర్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి.కృష్ణవేణి, కె.కృష్ణకుమారి, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన సింహా దుర్గాప్రసాద్ (32) వడ్రంగి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక ఈనెల 6వ తేదీ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

అత్తపై అల్లుడి దాడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భార్యాభర్తల గొడవ నేపథ్యంలో అడ్డువెళ్లిన అత్తను ఊచతో అల్లుడు దాడిచేసి గాయపరిచిన సంఘటన నారాయణపురంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. నారాయణపురానికి చెందిన నరుకుర్తి కాంతం, కుమార్తె దుర్గావేణి, అల్లుడు నారాయణ ఒకే ఇంటిలో పక్క పక్క పోర్షన్లలో నివసిస్తున్నారు. అయితే శనివారం నారాయణ, దుర్గావేణి గొడవ పడుతుండగా పక్కనే ఉన్న కాంతం వారి మధ్యకు వెళ్లింది. దీంతో కోపోద్రిక్తుడైన అల్లుడు నారాయణ.. కాంతంపై ఇనుపఊచతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె పొట్టపై గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. కాంతం ఫిర్యాదు మేరకు ప్రకాశం నగర్ ఎస్సై ప్రేమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.